సాక్షి
ములుగు
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



తల్లులు వనప్రవేశం చేసే రోజున గద్దెల ప్రాంగణంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు





తల్లులారా.. మళ్లొస్తాం

వీడ్కోలు పలికిన భక్తజనం

- మేడారంలో జనదేవతల వనప్రవేశం
- చిలకలగుట్టకు సమ్మక్క తల్లి, కన్నెపల్లికి సారలమ్మ..
- కొండాయికి గోవిందరాజు, పూనుగొండ్లకు పగిడిద్దరాజు
- ముగిసిన మహాజాతర.. ఇంటిదారి పట్టిన భక్తులు
- 28న సంప్రదాయబద్ధంగా తిరుగువారం పండుగ



సమ్మక్కను వనప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు



వన ప్రవేశానికి సారలమ్మ..

అందరికీ ధన్యవాదాలు

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతర విజయవంతానికి సహకరించిన పూజారులు, ఆదివాసీలు, అధికారులు, భక్తులకు.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. శనివారం జాతర ముగింపు సందర్భంగా మేడారంలోని ఎండోమెంట్ కార్యాలయ ఆవరణలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... జాతర నాలుగు రోజుల్లో 1.45 కోట్ల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని తెలిపారు. జాతర నిర్వహణకు అత్యధికంగా నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్టీసీ ద్వారా మేడారం జాతరకు దాదాపు 10 వేల బస్సు ట్రిప్పులు నడిపించినట్లు పేర్కొన్నారు. జాతరలో ఇద్దరు భక్తులు ప్రమాదవశాత్తు చనిపోయారని, జాతర నిర్వహణలో లోపాలుంటే అధికారులతో సమీక్షించి తిరుగువారం తర్వాత శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జాతర పూర్తయిన పది రోజుల వరకు పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయని అన్నారు. వచ్చే జాతరలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపడతానన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ డాక్టర్ శబరీష్, ఈఓ రాజేంద్రం పాల్గొన్నారు.



తిరుగు ప్రయాణంలో భక్తులు..

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం :

మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నాలుగు రోజులుగా భక్తజనంతో పులకించింది. లక్షలాది మందితో జనారణ్యంగా మారింది. తల్లులు శనివారం అడవి బాట పట్టడంతో భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. ముందుగా గోవిందరాజు, పగిడిద్దరాజు స్వస్థలాలకు బయల్దేరి వెళ్లారు. సమ్మక్క, ఆ తర్వాత సారలమ్మ వనప్రవేశం చేయడంతో మహాజాతర ముగిసినట్లు ప్రకటించారు. సమ్మక్కను వనానికి తీసుకెళ్లడానికి పూజారులు కొక్కెర క్రిష్ణయ్య, సిద్ధబోయిన మునీందర్ తదితరులు రాత్రి 7 గంటలకు గద్దెలపైకి చేరుకున్నారు. డోలు వాయిద్యాలు, బూర శబ్దాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పటికే సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల వద్ద వడ్డెలు రహస్య పూజలు చేశారు. ఈ తంతు ముగిసే వరకు దర్శనాలకు భక్తులను అనుమతించలేదు. రాత్రి 7.10 గంటల సమయంలో గద్దెల ప్రాంగణంలో విద్యుత్ దీపాలను ఆర్పివేశారు. సరిగ్గా రాత్రి 7.27 గంటలకు సమ్మక్కను తీసుకుని వడ్డెలు గద్దె దిగారు. తొలుత సారలమ్మ వైపు నడుచుకుంటూ వెళ్లి అక్కడ ఎదురుకోళ్ల దగ్గర పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన ద్వారం గుండా సమ్మక్కను చిలకలగుట్ట వైపు తీసుకెళ్లారు.

రాత్రి 7.40 గంటలకు సారలమ్మ వనప్రవేశం

సారలమ్మను కన్నెపల్లికి తీసుకెళ్లేందుకు ముందుగా గద్దె వద్ద వడ్డెలు పూజలు నిర్వహించారు. ఆదివాసీ యువకులు చీరలను తెరలుగా పట్టుకోగా సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం రాత్రి 7.40 గంటలకు సారలమ్మను గద్దెపైనుంచి కన్నెపల్లికి తీసుకెళ్లారు. అంతకు ముందు గోవిందరాజు పడిగెను తీసుకుని దబ్బగట్ల గోవర్ధన్, పొదెం బాబు సాయంత్రం 5.10 గంటలకు కొండాయికి బయల్దేరారు. ఆ తర్వాత 5.30 గంటలకు పగిడిద్దరాజు పడిగెను తీసుకుని వడ్డె పెనక బుచ్చిరాములు మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు బయల్దేరారు. దీంతో వనదేవతలు గద్దెలను విడిచి వెళ్లడంతో మహాజాతర అధికారికంగా ముగిసినట్లు అయ్యింది. సమ్మక్క–సారలమ్మ వనప్రవేశ పూజలు జరుగుతుండగానే గద్దెలపై భక్తులు సమర్పించిన చీరసారె, బంగారం, పసుపు కుంకుమను స్థానికులు తీసుకెళ్లారు. తల్లుల ప్రసాదాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

28న తిరుగువారం

మేడారంలో ఈనెల 28న సమ్మక్క–సారలమ్మకు పూజారులు తిరుగువారం పండుగ చేస్తారు. మహాజాతర ముగిసిన తర్వాత తిరుగువారం పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరకు వచ్చిన భక్తులు సల్లంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవార్లను వేడుకుంటారు. ఈ పండుగ సందర్భంగా మేడారం గ్రామస్తులు, ఆదివాసీలు, పూజారుల కుటుంబీకులు ఇళ్లను శుద్ధి చేసుకుని, అలికి సమ్మక్కను పూజిస్తారు. మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలో సారలమ్మ గుడి వద్ద అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సందర్భంగా ఇళ్లకు ఆహ్వానించిన బంధువులకు పూజారులు కొత్త వస్త్రాలు పెట్టి సాగనంపుతారు.

వర్షంలోనే వనప్రవేశం

ఏటూరునాగారం: మేడారంలో వనదేవతలను వానచినుకుల మధ్య వనప్రవేశం చేశారు. శనివారం ఉదయం నుంచి వర్షసూచన వాతావరణం కనిపించింది. తల్లుల వనప్రవేశం సందర్భంగా వర్షం పడుతుందని భక్తులు ఊహించినట్లుగానే.. సరిగ్గా పూజారులు గద్దెలకు వచ్చిన తర్వాత వర్షపు చినుకులు పడ్డాయి. వానలోనే అమ్మవార్లను వనప్రవేశం చేశారు. ఇది శుభపరిణామంగా భక్తులు భావిస్తున్నారు. 2020లో జరిగిన మహాజాతరలోనూ భారీ వర్షం కురిసింది. అప్పుడు కూడా వానలోనే వనప్రవేశం చేశారు.



పగిడిద్దరాజు, గోవిందరాజును తీసుకెళ్తున్న పూజారులు

ఖాకీల్లో సమన్వయ లోపం

మేడారం జాతరలో పోలీసుల విఫలం



జాతరలో కీలకంగా నిలవాల్సిన పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించింది. పదుల సంఖ్యలో ఎస్పీలు, వందల సంఖ్యలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, వేల సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. ఐపీఎస్ వంటి ఉన్నత అధికారి విచక్షణ కోల్పోయి ఒక ఆర్ఎస్సైపై దాడి చేయడం అధికారుల్లో ఆగ్రహం కలిగించింది. దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో అనేక పాట్లు పడ్డారు. విపరీతమైన ట్రాఫిక్‌తో మేడారం జాతరకు వచ్చివెళ్లే భక్తులు అవస్థలు పడ్డారు. అంతేకాకుండా దొంగలు రెచ్చిపోయారు.

– వరంగల్ క్రైం

- 8లో▸



1.45 కోట్ల మంది దర్శనం

మేడారంలో వనదేవతలను కోటి మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతరకు ముందు కూడా భారీ సంఖ్యలో భక్తులు వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. జాతర జరిగిన నాలుగు రోజుల వ్యవధిలో దాదాపు 1.45 కోట్ల మంది భక్తులు వచ్చి వెళ్లినట్లు అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

14 కిలోమీటర్లు.. మూడున్నర గంటలు

తాడ్వాయి– మేడారం రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

జాతరలో ట్రాఫిక్ సమస్యతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు మేడారం – తాడ్వాయి, తాడ్వాయి – పస్రా రూట్లలో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు భారీగా నిలిచిపోయాయి. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడారానికి వెళ్లడానికి మూడున్నర గంటల సమయం పట్టింది. దీంతో భక్తులు ఫోన్‌సిగ్నల్స్, తాగునీరు లేక నానా అవస్థలు పడ్డారు.

- వివరాలు 8లో▸ – ఏటూరునాగారం

జాతర చివరిరోజు జంపన్న వాగు జంట వంతెనలకు ఇరువైపులా కనిపించని భక్తుల రద్దీ



ఖాకీల్లో సమన్వయ లోపం

అనుభవం లేకపోయినా అందలం

- శిక్షణ అధికారులపై సిబ్బంది గుర్రు
- ఆర్ఎస్సైపై దాడి.. అధికారుల్లో ఆగ్రహం
- రెచ్చిపోయిన దొంగలు.. పట్టించుకునే నాథుడే కరువు


క్యూలైన్ల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

వరంగల్ క్రైం: అధికారుల అత్యుత్సాహం భక్తుల పాలిట శాపంగా మారింది. మేడారం మహా జాతరలో కీలకంగా నిలవాల్సిన పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లోపించి శాఖ పరువు బజారుకెక్కింది. పదుల సంఖ్యలో ఎస్పీలు, డీఎస్పీలు, ఉన్నతాధికారులు, వందల సంఖ్యలో ఇన్‌స్పెక్టర్లు, వేల సంఖ్యలో సిబ్బంది ఉన్నా జాతర విధుల్లో పోలీస్ శాఖకు కనీసం పాస్ మార్కులు కూడా పడకపోవడం గమనార్హం. ఐపీఎస్ అధికారి విచక్షణ కోల్పోయి ఓ ఆర్ఎస్సైపై దాడి చేయడం.. అధికారుల్లో ఆగ్రహం కలిగించింది. దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు జాతర విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, అధికారుల పనితీరుపై చీదరించుకున్నారు. గత జాతరకంటే ఈసారి ఎక్కువ మంది సిబ్బందిని నియమించినప్పటికీ ఆశించిన ఫలితాలు ఎందుకు రాలేదు? అనే ప్రశ్న ఉన్నతాధికారులను వేధిస్తోంది.

పోలీస్ జాతర..

మేడారం జాతర.. పోలీస్ జాతరగా రూపాంతరం చెందింది. భక్తులు తల్లులను దర్శించుకునే అవకాశాలను పోలీసులు చేజేతులా నాశనం చేశారనే ఆరోపణలు వినిపించాయి. గతంలో వనం నుంచి గద్దెలకు అమ్మవార్లను తీసుకొచ్చేందుకు పోలీస్ అధికారులు రెండు రోప్ పార్టీలను ఏర్పాటు చేసేవారు. ఈసారి నాలుగు ఏర్పాటు చేసి భక్తులకు మరింత ఇబ్బందులను సృష్టించారు. అవసరం లేకున్నా.. బలవంతంగా భక్తులను దూరంగా నెట్టివేశారు. పోలీసుల తీరుకు భక్తులు, ఆదివాసీ యువకులు సైతం ఇబ్బందులు పడ్డారు. జాతర బందోబస్తు విధుల్లో అడుగడుగునా.. పోలీసులు కనిపించినా భక్తులకు మాత్రం ఇబ్బందులు తప్పలేదు. పోలీసుల పనితీరు చూసి.. ఇది మేడారం జాతర కాదు.. పోలీసుల జాతర అని పలువురు చర్చించుకున్నారు.

కొరవడిన సమన్వయం

జాతర విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపించింది. జాతర విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొని అనుభవం పొందడానికి సుమారు 10 మంది శిక్షణ ఐపీఎస్ అధికారులు, సుమారు 600 మంది శిక్షణ ఎస్సైలకు జాతర విధులు కేటాయించారు. వారందరినీ గత జాతరలో అనుభవం ఉన్న అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోలేదు. దీంతో శిక్షణ అధికారులకు ఎలాంటి అనుభవం లేకపోవడంతో వారికి తోచినట్లు చేసుకుంటూపోయారు. ఒకరికి కేటాయించిన సెక్టార్లలో మరొకరు జోక్యం చేసుకున్నారు. దీంతో ఆశించిన ఫలితాలు కనిపించలేదు. గత జాతరలో పని చేసిన అధికారులు సైతం 'ఏం జరుగుతుందో చూద్దాం' అనే రీతిలో మౌనం వహించారు. దీనికి తోడు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోకి రాకుండా.. ఉన్న చోటు నుంచే సూచనలు చేసే వరకు పరిమితమయ్యారు. ములుగు ఎస్పీ శబరీశ్ కష్టపడ్డప్పటికీ ప్రణాళిక లేకపోవడంతో భక్తులకు మెరుగైన సేవలను అందించలేకపోయారు. శిక్షణ ఐపీఎస్, సబ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా దర్శనం కోసం వచ్చిన భక్తులను సైతం కంట్రోల్ చేయలేకపోయారు. పద్ధతి ప్రకారం విధులు కేటాయించి వారి పని చేస్తున్నారో.. లేదో పర్యవేక్షణ చేయలేకపోయారనే ఆరోపణలు వినిపించాయి.

ఆర్ఎస్సైపై దాడి.. అధికారుల ఆగ్రహం

జాతర విధులు నిర్వర్తిస్తూ.. తన కుటుంబ సభ్యులకు తల్లుల దర్శనం చేయించాలని ఆశించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఆర్ ఎస్సైపై ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం 'నీ విధులేంటి? ఇక్కడ నువ్వు చేస్తుందేంటి?' అంటూ దాడి చేయడంతో ఒక్కసారిగా ఆర్ఎస్సై షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న తోటి సిబ్బంది ఎస్పీ గౌష్ ఆలంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేస్తే మందలించాలి కానీ.. విచక్షణ కోల్పోయి దాడి చేయడమేంటని వారు ప్రశ్నించారు. స్వచ్ఛందంగా విధులను బైకాట్ చేస్తామని హెచ్చరించారు. కొంత మంది అధికారుల సర్దిచెప్పడంతో విషయం సద్దుమణిగింది. ఈ ఘటనను వరంగల్ పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది.

రెచ్చిపోయిన దొంగలు

మహాజాతరలో దొంగలు రెచ్చిపోయారు. వందల మంది భక్తులకు సంబంధించిన బంగారు ఆభరణాలు, బ్యాగులు, పర్సులు అపహరించారు. బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు అవకాశం లేకుండా పోయింది. కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని స్థితిలో మేడారం పోలీసులు ఉండిపోయారు. ఇద్దరే ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను ఉంచి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు కోల్పోయిన బాధితులకు భరోసా కల్పించే నాథుడు లేకపోవడం గమనార్హం. ప్రతీ జాతరలో స్థానిక దొంగలు, అంతర్రాష్ట్ర దొంగల కదలికలపై సీసీఎస్ అధికారులు నిఘా ఉంచేవారు. నష్టపోయిన బాధితుల వివరాలు తీసుకుని కేసులు నమోదు చేసేవారు. దొంగల నుంచి చోరీ సొత్తు రికవరీ అయితే వెంటనే బాధితులకు అక్కడే అందజేసేవారు. దీంతో కొంత మందికైనా తక్షణ సాయం దొరికేది. కానీ.. ఈ జాతరలో అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. అధికారుల మధ్య కొరవడిన సమన్వయ లోపం కారణంగా పోలీస్ శాఖ ఫెయిల్యూర్ అయినట్లు భక్తులు చర్చించుకుంటున్నారు.

కొందరికి ప్రశంసలు..

మేడారం జాతరలో భక్తులకు సేవలందించిన వందలాది మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసలు అందాయి. వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి భక్తుల నుంచి మెప్పు పొందారు. కొంత మంది అధికారులకు మాత్రం జాతర బందోబస్తు ఆటవిడుపుగా మారింది. ఏసీ గదుల నుంచి బయటకు రాకుండా ఉండిపోయారు. మరికొంత మంది అధికారులకు అదే భక్తుల చేతుల్లో దెబ్బలు సైతం తిన్నారు. ఏదేమైనప్పటికీ మేడారం జాతరలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవడం సరి కాదని, దీనిపై ఉన్నతాధికారులు సమీక్షించి.. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శనివారం ఉదయం మేడారం-తాడ్వాయి మధ్యలో నిలిచిపోయిన వాహనాలు



నిలిచిన సేవలు

మేడారం జాతరకు వచ్చే, వెళ్లే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు చుక్కలు చూపించాయి. పోలీస్ అధికారులు మాత్రం ట్రాఫిక్ బందోబస్తు కోసం 4 వేల మంది సిబ్బంది, ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు రావు.. అని పదే పదే చెప్పారు. కానీ.. వారి మాటలకూ, వాస్తవ పరిస్థితికి ఎక్కడా పొంతన కుదరలేదు. శుక్రవారం మూడు కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు ఆరున్నర గంటల సమయం పట్టింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న మహిళల పరిస్థితి వర్ణనాతీతం. తాడ్వాయి నుంచి పస్రా వరకు ట్రాఫిక్‌లో వేలాది వాహనాలు గంటల తరబడి నిలిచాయి. దీంతో భక్తుల ఆగ్రహాన్ని పోలీసు అధికారులు చవిచూశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలు ఏమైనట్లు? అనే ప్రశ్న భక్తుల నుంచి వినిపిస్తోంది. జాతరలో గద్దెల నుంచి జంపన్నవాగు, గద్దెల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు పోలీస్ అధికారులు వినియోగించిన వాహనాల కారణంగా భక్తులు ఇబ్బందులు పడ్డారు. గురువారం ఏకంగా పోలీస్ వాహనాల వల్ల అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది.

దైవదర్శనాలకు వెళ్లొచ్చే సరికి..

దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. దైవదర్శనాలకు వెళ్లొచ్చేసరికి ఇళ్లను గుల్ల చేశారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో లక్షలాది రూపాయల నగదు, బంగారం, వెండిని అపహరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పలు ఇళ్లలో చోరీలు
- లబోదిబోమంటున్న బాధితులు
- ఉమ్మడి జిల్లాలో ఘటనలు


రఘునాథపల్లి: బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ


మహబూబాబాద్ రూరల్: వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రఘునాథపల్లి: మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసి ఉన్న ఆరు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం గ్రామంలోని స్టేషన్ కాలనీకి చెందిన పర్వత యాదగిరి మేడారం జాతరకు వెళ్లాడు. ఈ క్రమంలో దుండగులు.. యాదగిరి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని రూ 1.74 లక్షల విలువైన 25 గ్రాముల బంగారం, 320 గ్రాముల వెండితోపాటు రూ. 50 వేల నగదు అపహరించుకెళ్లారు. అలాగే ఆ ఇంటి పక్కనే ఉన్న వరదాటి భాస్కర్, అన్నపురెడ్డి శ్రవణ్‌కుమార్, సతీష్, రేణుక, యాదమ్మ ఇళ్ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. ఆ ఇళ్లలో చిన్న వస్తువులు చోరీ చేశారు. ఉదయంలో ఇళ్ల తలుపులు తెరిచి ఉండడంతో గమనించిన చుట్టు పక్కల వారు యజమానులకు సమాచారం అందించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ శ్రీనివాస్‌యాదవ్ ఘటనా స్థలాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

మానుకోటలో..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్‌లో శనివారం నలుగురి ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటనలో 3 తులాల బంగారం, 150 తులాల వెండి, రూ.2.26 లక్షల నగదు అపహరణకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని షికార్ ఖాన గడ్డ ప్రాంతంలో నివాసం ఉండే షేక్ మక్సూద్, షేక్ మసూద్, షేక్ నసీమ, షేక్ అంకూష్ శుక్రవారం తమ ఇళ్లకు తాళాలు వేసి అన్నారం షరీఫ్ దర్గా దైవ దర్శనానికి వెళారు. శనివారం స్థానికులు చూసేసరికి బాధితుల ఇళ్ల తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే బాధితులకు చెప్పగా హుటాహుటినా ఇళ్లకు చేరుకుని పోలీసులకు విషయం తెలిపారు. పోలీసులు ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఈ ఘటనలో 3 తులాల బంగారం, 150 తులాల వెండి, రూ. 2.26 లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై రామారావు తెలిపారు.

శనిగరంలో..

నల్లబెల్లి: మండలంలోని శనిగరంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎస్సై నైనాల నగేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కూస కరుణాకర్, తన తమ్ముడు బాబు కుటుంబ సభ్యులతో కలిసి నాగరాజుపల్లి మద్ది మేడారం జాతరకు వెళ్లి వన దేవతలకు మొక్కులు అప్పగించారు. అదే రోజు సాయంత్రం కరుణాకర్ ఇంటి చేరుకోగా తలుపులు తెరిచి ఉన్నాయి. గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా టేబుల్‌లో భద్రపరిచిన 18 గ్రాముల బంగారం, 140 గ్రాముల వెండి అపహరణకు గురైంది. అలాగే, బాబు ఇంట్లో 80 గ్రాముల వెండి అపహరణకు గురైంది. నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నగేష్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ వెంకట్‌ను గద్దెల వద్దకు తీసుకొస్తున్న మంత్రి, ఎత్తు బంగారంతో ఎంపీ వద్దిరాజు





తల్లులకు ప్రముఖుల పూజలు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే, చీఫ్ విప్ వడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జడ్జిలు హరిప్రియ, రేవతి, డీఐజీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అమ్మవార్ల దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ సంప్రదాయంగా పూజారులు, ఈఓ రాజేంద్రం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పట్టు వస్త్రాలు, ప్రసాదం అందించారు. కాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు.

పారిశుద్ధ్య కార్మికులకు సలాం..

- మేడారం జాతరలో సేవలు అమోఘం
- ఆరు రోజుల పాటు నిరంతర శ్రమ


పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

మేడారం(కాటారం): తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతరలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. లక్షలాది మంది భక్తులు వన దేవతలను దర్శించుకోవడానికి రాగా పారిశుద్ధ్య నిర్వాహణ చేపట్టి భేష్ అనిపించుకున్నారు. బుధవారం సారలమ్మ రాకతో జాతర ఘట్టం ప్రారంభంకాగా.. శనివారం దేవతలు వన ప్రవేశంతో జాతర ముగిసింది. అతిపెద్ద వన జాతర కావడంతో దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు. కోళ్లు, మేకలు బలివ్వడం, వంట చేసుకోవడం, తినుబండారాలు వినియోగించడంతో జాతర పరిసరాలు చెత్తతో నిండాయి. వీటి వల్ల పారిశుద్ధ్యం లోపించి భక్తులు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. అయితే పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం అన్ని ప్రాంతాల్లో తిరిగి చెత్త, వ్యర్థాలు లేకుండా శుభ్రం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపించినా కార్మికులు మాత్రం తమ బాధ్యతలు నిర్వర్తించడంలో ఎక్కడా అలసత్వం వహించలేదు. పారిశుద్ధ్యం పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

సుమారు 4వేల మంది..

జాతరలో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, శ్రీకాకులం, విజయవాడ నుంచి సుమారు 4 వేల మంది కార్మికులు మేడారం వచ్చారు. సెక్టార్‌కు వంద మంది కార్మికుల చొప్పున షిఫ్టుల వారీగా ఆరు రోజుల పాటు పారిశుద్ధ్య పనుల కోసం శ్రమించారు. వీరిలో అధికంగా మహిళా కార్మికులే ఉన్నారు.

సేవలా భావిస్తున్నా..



మేడారం జాతరలో పారిశుద్ధ్య పనులు చేయడం అమ్మవార్లకు సేవ చేసినట్లు భావిస్తున్నా. కూలీ కంటే అమ్మవారి సన్నిధిలో ఉంటున్నానే భావన ఎంతో సంతోషం ఇచ్చింది. అవకాశం వస్తే మరో జాతరకు కూడా పనులు చేయడానికి వస్తా.

- వెంకాయమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు

పది రోజులుగా ఉంటున్నా..



మేడారంలో పారిశుద్ధ్య పనులు చేయడానికి పది రోజులుగా జాతరలోనే ఉంటున్నా. పనిభారం ఎక్కువ అయినా అమ్మవార్ల దయతో పనులు చేస్తున్నా. ఇంత మంది భక్తుల కోసం పని చేయడం సంతోషంగా ఉంది.

- కుమారి, పారిశుద్ధ్య కార్మికురాలు

సమన్వయంతో విజయవంతం ..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మహాజాతర విజయవంతంలో ప్రభుత్వంతోపాటు అధికారులు, భక్తుల పాత్ర కీలకం. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, అధికారుల సమన్వయంతో మహాజాతర విజయవంతమైందని పలువురు అధికారులు, పూజారులు తెలిపారు. ఈ మేరకు 'సాక్షి'తో తమ మనోగతం వెల్లడించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

సమష్టి కృషితో జాతర సక్సెస్..



సమష్టి కృషి, సమన్వయంతో మేడారం మహాజాతర విజయవంతంగా ముగిసింది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, డీసీ శ్రీకాంత్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఈఓ రాజేంద్రం, ఈఓ

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు



మహాజాతరకు వచ్చిన లక్షలాది మంది భక్తులకు సకాల సౌకర్యాలు కల్పించి జాతర విజయవంతానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. జాత రలో పూజారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, పోలీసులు సహకరించారు. మంత్రి సీతక్క జాతర విజయవంతం కోసం అన్ని తానై ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

- సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

భక్తులకు ఎక్కడా ఆటంకం కలగలేదు



భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తరపున ప్రణాళికాప్రకారం అన్ని చర్యలు చేపట్టాం. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు అందుబాటులో తెచ్చాం. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అధికారులు, భక్తులకు ఎప్పుడు అందుబాటులో ఉండి కావాల్సిన సేవలు అందించా. జాతర విజయవంతానికి కృషి చేసి మంత్రి సీతక్క, అధికారులకు ఉత్సవ కమిటీ తరపున కృతజ్ఞతలు.

- అరెం లచ్చు పటేల్, జాతర కమిటీ చైర్మన్

విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయం


మేడారంలో విద్యుత్‌కాంతులు

కాజీపేట అర్బన్ : మేడారం జాతరలో నిరంతర విద్యుత్ సరఫరాలో విద్యుత్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందజేసేందుకు డైరెక్టర్లు,సీజీఎంలు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు స్వీయ పర్యవేక్షణ కొనసాగించారన్నారు. జాతరలో నూతన ఆధునిక సాంకేతికతను వినియోగించామన్నారు.

మొక్కులు చెల్లించుకున్న కలెక్టర్ దంపతులు

భూపాలపల్లి రూరల్: ములుగు జిల్లా మేడారం జాతరలో భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి దంపతులు శనివారం తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క–సారలమ్మకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు.

బంగారాన్ని తూకం వేస్తున్న భవేష్‌మిశ్రా ➤



పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఆనంద్‌కుమార్

కేయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ బి.ఆనంద్‌కుమార్ కోరారు. శనివారం కేయూలోని మేథమెటిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో 'ప్రభుత్వ పథకాలు, అవకాశాలు' అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ పథకాలు, సబ్సిడీ గురించి అంబేడ్కర్ ఓవర్సీస్ స్కీమ్ గురించి వివరించారు. ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఆనంద్‌కుమార్‌ను కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధ్యాపకులు శాలువా కప్పి పూలబొకేను అందించారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఆ విభాగం ఆచార్యులు రాజ్‌కుమార్, తిరుమలాదేవి, సోమయ్య, భారవిశర్మ, వివిధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్య సాధన

కాజీపేట అర్బన్: ఆత్మస్థైర్యంతో కృషి చేస్తే లక్ష్య సాధన సులభమవుతుందని ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ బి.ఆనంద్‌కుమార్ తెలిపారు. సుబేదారిలో వంశీకా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శనివారం సందర్శించారు.

గద్దెల వద్ద భక్తులకు గాయాలు



కొబ్బరికాయలు విసరడంతో గాయపడిన భక్తులు

మేడారం(కాటారం) : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వన దేవతలను దర్శించుకున్నారు. అమ్మవార్ల అనుగ్రహాన్ని కాంక్షిస్తూ మొక్కులు తీర్చుకునే క్రమంలో పలువురు భక్తులు దూరం నుంచి గద్దెల పైకి కొబ్బరికాయలు, బెల్లం విసిరేస్తుండడంతో ఇతర భక్తులకు తగిలి తీవ్ర గాయాల పాలై ఆవేదన భరితంగా మారింది.

కళాకారుడికి సత్కారం



రహీమొద్దీన్‌కు ప్రసాదం అందజేస్తున్న మంత్రి సీతక్క

మేడారం(వరంగల్): ములుగు జిల్లా కాశిందేవిపేట కళాకారుడు ఎండీ.రహిమొద్దీన్‌ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) శనివారం కండువా కప్పి సత్కరించారు. అమ్మవార్ల ప్రసాదం అందజేశారు. రహిమొద్దీన్ 32 ఏళ్లుగా మేడారం మహా జాతరలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

14 కిలోమీటర్లు.. మూడున్నర గంటలు

తాడ్వాయి- మేడారం రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్

- ఫోన్ సిగ్నల్స్, తాగునీరు లేక భక్తుల అవస్థలు
- గంటల తరబడి మేడారం బస్టాండ్‌లో పడిగాపులు
- డ్రైవర్లు, కండక్టర్లతో వాగ్వాదం



తాడ్వాయి నుంచి మేడారం వరకు నిలిచిన ఆర్టీసీ బస్సులు, ఇతరవాహనాలు

ఏటూరునాగారం: అంతా అనుకున్నట్టే అయింది. ఏదైతే జరగొద్దనుకున్నారో అదే జరిగింది. మేడారం మహాజాతరలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలించలేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 వరకు మేడారం నుంచి తాడ్వాయి, తాడ్వాయి నుంచి పస్రా వరకు ఆర్టీసీ బస్సులు, వీఐపీ పాస్ కలిగిన వాహనాలు బారులుదీరాయి. 14 కిలోమీటర్ల ప్రయాణానికి (మేడారం వెళ్లడానికి) మూడున్నర గంటల సమయం పట్టింది. దీంతో బస్సులో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎవరికైనా సమాచారం ఇవ్వాలన్నా బస్సులు ఆగిన స్థలంలో ఫోన్ సిగ్నల్స్ లేక నరకయాతన పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు కాజీపేట నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు శనివారం ఉదయం 5 గంటలకు తాడ్వాయి ఆర్చ్ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి 5 గంటలకు బయలుదేరిన బస్సు మేడారం చేరుకునే వరకు ఉదయం 8.30 గంటలైంది. కేవలం 14 కిలోమీటర్ల దూరానికి 3.30 గంటల సమయం పట్టిందంటే ట్రాఫిక్ ఎంతమేర నిలిచిందో తెలుస్తోంది. అలాగే, మేడారంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయగా ఇందులో బారులుదీరారు. విసిగి వేసారి మొక్కుల చెల్లింపుల కోసం వచ్చే ప్రయాణికులు బస్సు దిగకముందే సీట్లను దక్కించుకోవాలని ఆత్రుతతో దస్తీ, ఇతర వస్తువులు వేసేందుకు పోటీపడ్డారు. అడ్డుచెప్పిన డ్రైవర్లు, కండక్టర్లతో వాగ్వాదాలకు దిగారు. కాగా, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలా అనేక కష్టాలు పడుతూ వనదేవతలను దర్శించుకోవాల్సి వచ్చిందని పలువురు భక్తులు వాపోయారు.

భక్తుల తిరుగు ప్రయాణం..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణయ్యారు. శనివారం తల్లులు వనప్రవేశం కావడంతో భక్తులు ఇంటి దారి పట్టారు. దీంతో మేడారం పరిసరాలన్నీ ఖాళీ అవుతున్నాయి. జంపన్నవాగు నుంచి గద్దెల వరకు, గద్దెల ప్రాంగణం, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో మాత్రం శనివారం రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. వివిధ జిల్లాల్లో నుంచి జాతర విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది కూడా అమ్మవార్ల వనప్రవేశం అనంతరం తమ స్వస్థలాలకు వెళ్లారు. ఫలితంగా భక్తులకు ఆతిథ్యమిచ్చిన రెడ్డిగూడెం, ఊరట్టం, కాల్వపల్లి, కొత్తూరు, నార్లాపూర్ గ్రామాలన్నీ బోసిపోయాయి. కాగా, ఆదివారం వేలాది మంది భక్తులు మేడారం తరలిరానున్నారు.